నిర్బంధాలతో ప్రశ్నించే గొంతుకను నొక్కలేరు



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతులను నొక్కలేరని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసి ఆమె దిష్టి బొమ్మలను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసన సభలో మహిళను అగౌరపరచి వారి పార్టీ నాయకులతో మహిళల దిష్టిబొమ్మలను దహనం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. అధికారంలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను అవమానించడం తగదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై సబితా ఇంద్రారెడ్డి శాసనసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తున్నారన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పి అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. అసెంబ్లీలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తెలపాలని స్పీకర్‌ను అడిగితే నాలుగు గంటలు మైకు ఇవ్వకుండా నిలబెట్టడం దారుణమన్నారు. ఈ సమావేశంలో పెండ్యాల నగేష్, శ్రీనివాస్, అరవింద్‌కుమార్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్‌గౌడ్, అనురాధ పాల్గొన్నారు.

‘సుప్రీం’ తీర్పుపై సంబరాలు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ వెనుకకు తీసుకోవడానికి వీలులేకుండా దానికి బిల్లు రూపకంగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వర్గీకరణ ఉద్యమంలో భాగస్వాములైన ఎమ్మార్పీఎస్ నేతలు, అనుబంధ సంఘాల నాయకులకు ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, నవీన్, శేఖర్, సతీష్, రాజు, భాస్కర్, పాండు పాల్గొన్నారు.

ముమ్మరంగా జ్వర సర్వే

వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రులకు తరలింపు



వివరాలు తెలుసుకుంటున్న మెడికల్ అధికారి జ్యోతి

చాదర్‌ఘాట్: వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) పరిధిలో ఇంటింటికి జ్వర సర్వే ముమ్మరంగా జరుగుతుంది. మలక్‌పేట నియోజకవర్గ పరిధి 15 బస్తీ దవాఖానాల పరిధిలో గత కొన్ని రోజుల నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వర సర్వే చేపడుతున్నారు. తాజాగా వైద్య అధికారులు జారీచేసిన ఆదేశాలతో మలక్‌పేట నియోజకవర్గ పీహెచ్‌సీ వైద్యులు అప్రమత్తమయ్యారు. ఈ సర్వేలో ఏఎస్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు భాగస్వాములు అవుతున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో 30 ఇళ్లలో నివసించే వారి ఆరోగ్య వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలపై ఆరా

జ్వరం, ఒంటి నొప్పులు జలుబు, దగ్గు వంటి లక్షణాలపై ఆరా తీస్తున్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో 72563 మంది ఆరోగ్య వివరాలు సేకరిస్తూ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు. ప్రతి బస్తీ దవాఖానా పరిధిలోను డెంగీ కేసులు నమోదు అవుతుండటం పట్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ సర్వేను మరింత పారదర్శకంగా చేపట్టారు. డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వారిని ఆసుపత్రికి తరలిస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నాగోలు: నగరంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగోలు ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణ సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగోలు పరిధిలోని బండ్లగూడ, ఆనంద్ నగర్ ప్రాంతాల్లో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ కృష్ణ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీలు అడిగితే చెప్పరాదన్నారు. గుర్తింపు లేని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, ఫోన్‌లలో ఉండే యాప్‌ల ద్వారా లోన్లు తీసుకోరాదన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలు క్రయవిక్రయాలు పెరుగుతూ యువత పెడదారిన పడుతుందని దీంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా ఉంచాలన్నారు.ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శివ నాగ ప్రసాద్, రమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన పోచమ్మవారి ఆలయంలో ఈ నెల 6 నుంచి జరిగే అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బోనాల వేడుకలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డిని వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ మాట్లాడుతూ..కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని పోచమ్మ ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి మూలవిరాట్ విగ్రహ, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ, బోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లేష్‌గౌడ్, జగదీష్‌గౌడ్, రాజేందర్, రవిముదిరాజ్, చీర తిరుమలేష్ పాల్గొన్నారు.

బోనాల పండగను ప్రశాంతంగా నిర్వహిస్తాం



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: వచ్చే ఆదివారం డివిజన్‌లోని పలు దేవాలయాలలో జరిగే బోనాల జాతరను ప్రశాంతంగా జరిపేందుకు కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అన్మగల్ పోచమ్మ, పోచమ్మ బస్తీ పోచమ్మ, కట్టమైసమ్మ, పెద్దమ్మ తల్లి, ఈదమ్మ దేవాలయాల వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి ఆటంకం లేకుండా పండుగను నిర్వహిస్తామన్నారు.

‘ప్రభుత్వాలు మారినా విద్యలో మార్పు లేదు’

నాగోలు: ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ విద్యలో ఎలాంటి మార్పు లేదని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్ అన్నారు. న్యూనాగోలులో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) సరూర్‌నగర్ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో క్రాంతి కుమార్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అధికారులు సైతం విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారన్నారు. గతంలో నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలపై వ్యతిరేకంగా మాట్లాడిన వారు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ సరూర్‌నగర్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా భవాని, వినోద్, ఉపాధ్యక్షులుగా పావని,శివమణి, సహాయ కార్యదర్శులుగా వంశీ, రేణుక కార్యవర్గ సభ్యులుగా సూర్య, జగదీష్, మేఘన, ఉష, కౌన్సిల్ సభ్యులుగా విగ్నేష్, దుర్గాప్రసాద్, రాజేష్, సుమలత అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సు ఆపేందుకు చోటేది?

- బస్టాప్, షెల్టర్ల ముందు అక్రమ పార్కింగ్
- పాఠశాల ముందు నుంచి రాకపోకలు
- ప్రమాదపుటంచున విద్యార్థులు



బస్ షెల్టర్ ముందు నిలిచిన వాహనాలు

వనస్థలిపురం: అక్రమ పార్కింగ్‌లపై పర్యవేక్షణ లేకపోవడంతో సామాన్య ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. వనస్థలిపురం కాంప్లెక్స్ ప్రధాన రోడ్డులోని ఉన్న బస్టాప్‌ల ముందు భారీ సంఖ్యలో వాహనాలు నిలుపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అక్కడున్న వివిధ దుకాణాలకు వచ్చే వారు రోడ్లు, బస్టాప్‌ల ముందు గంటల తరబడి తమ తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆ దారిన వెళ్లాల్సిన బస్సులు సైతం బస్టాప్‌ల వద్ద స్థలం లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల ముందు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.



పాఠశాల ముందు నుంచి వెళ్తున్న బస్సు, అప్పుడే బయటకు వస్తున్న విద్యార్థినులు

రూటు మార్చిన బస్సులు..

నగరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు వనస్థలిపురం కాంప్లెక్స్ మీదుగానే హయత్‌నగర్ వైపు వెళ్తుంటాయి. కాంప్లెక్స్‌లో గాంధీ బొమ్మ వద్ద బస్టాప్, షెల్టర్ ఉన్నాయి. గతంలో గాంధీ బొమ్మ ముందు నుంచి వెళ్లే బస్సులు కాంప్లెక్స్‌లో అక్రమ పార్కింగ్‌తో రోడ్డు కుంచించుకుపోయి బస్సులు వెళ్లలేని దుస్థితి నెలకొని పక్కనున్న ప్రభుత్వ పాఠశాల రోడ్డులో నుంచి వెళ్తున్నాయి.గాంధీ బొమ్మ వద్ద ఉన్న బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారి కాలక్షేపపు రాయుళ్లకు అడ్డాగా మారింది. కాంప్లెక్స్ ప్రధాన రహదారిలో వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు అటు వైపు చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

వనస్థలిపురం కాంప్లెక్స్ గాంధీ బొమ్మ ముందు నుంచి వెళ్లాల్సిన బస్సులు పాఠశాల ఇరుకు గల్లీలో నుంచి వెళ్తుండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం, సమయాల్లో విద్యార్థులు రోడ్డు మీదకు వస్తుంటారు. ఏ బస్సు ఎప్పుడు ఎటు నుంచి వస్తోందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాంప్లెక్స్ ప్రధాన రహదారిలో వెళ్లాల్సిన బస్సులను పాఠశాల ముందు నుంచి తిప్పాల్సిన అవసరం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలి..

వనస్థలిపురం కాంప్లెక్స్ ప్రధాన దారిలో పలువురు అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు కుంచించుకుపోయి ఆ దారిన వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నడపలేని స్థితి ఉండడంతో డ్రైవర్లు బస్సులను పక్కనే ఉన్న పాఠశాల గల్లీలో నుంచి నడుపుతున్నారు. కాంప్లెక్స్‌లో అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేసేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.
–రామ్మోహన్, వనస్థలిపురం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉ.10 గంటల నుంచి 11.30 వరకు..

గురుదాస్, సలీంనగర్, పద్మావతి అపార్ట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్, వాణికాలేజ్, కిడ్నీ హాస్పిటల్, నల్గొండ క్రాస్‌రోడ్స్, సాహైల్ హోటల్, సోమ్‌నాథ్ టెంపుల్, హమన్‌నగర్ ఏ, సుల్తాన్ బేకరీ, రహ్మత్‌నగర్, కుల్సుమ్ మజీద్, ఎంబీ హట్స్, క్రీడా, న్యూ అండ్ ఓల్డ్ అర్చన, ఐఎస్‌సదన్ రోడ్, ధోబీఘాట్, భానునగర్, హైదరాబాద్ హౌజ్, సైదాబాద్ మెయిన్‌రోడ్, అజాద్ పార్క్ గంగం బౌళీ, అజారియా మజీద్, ఇండియా ఫంక్షన్‌హాల్ పరిసర ప్రాంతాలు.

11.30 నుంచి ఒంటి గంట వరకు..

ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీనగర్, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, పోచమ్మ టెంపుల్, ద్వారకా నివాస్, అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, మలక్‌పేట, మౌలా కా ఛిల్లా, హస్మీ హోటల్, చమేలికా మండువా, హుస్సేన్ కోటి, రహ్మానియా మదర్సా, ఎస్‌ఆర్‌టీ కాలనీ, గాంధీ కా పుత్లా, మార్నింగ్ స్టార్, కమ్యూనిటీ హాల్, అజంత్‌నగర్ నాలా, ఇమాంబండ నాలా పరిసర ప్రాంతాలు.

మ.3 నుంచి సాయంత్రం 4.30 వరకు..

ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్, డబీర్‌పురా బ్రిడ్జి, షా కాలనీ, ముంతాజ్ కాలనీ, గ్రేవ్‌యార్డ్, మినాజ్ స్కూల్, యూనిక్ స్కూల్, గౌస్‌కేఫ్, ఇమ్లిబన్ మజీద్, ముర్తుజా నగర్, సాదత్‌నగర్, బడా చంద్రానగర్, నెహ్రూనగర్, మస్కతి పార్క్, రెయిన్‌బజార్ గ్రౌండ్, కార్నర్ టీ పాయింట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చంపాపేట: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. చంపాపేట ఫీడర్ల పరిధిలో ఉ. 10.30 నుంచి 11 గంటల వరకు పటేల్‌నగర్, శిఖరాఎన్‌క్లేవ్, రాఘవేంద్ర, వైశాలీనగర్, నాగార్జున, ఆర్‌టీసీ, కేశవనగర్, ఎస్‌ఎన్‌నగర్, భానునగర్, సింగరేణి కాలనీలు. ఉ.11 నుంచి 11.30 గంటల వరకు పద్మానగర్ ఫీడర్‌ల పరిధి పద్మానగర్, క్రాంతినగర్, రాఘవేంద్ర, నిర్మలానగర్, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్ పాతబస్తీ. మ.12 గంటల నుంచి 12.30 గంటల వరకు మారుతీనగర్ ఫీడర్‌లపరిధి మారుతీనగర్, ఈస్ట్ మారుతీనగర్, అంబేడ్కర్‌వాడ కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచన బోధనలు

ఎల్వీ సేవా వేదిక చైర్మన్ ఎల్‌వీ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ కమిటీ, ఎల్వీ సేవా వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రత్యేక ఆధ్యాత్మిక పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్వీ సేవా వేదిక చైర్మన్ ఎల్‌వీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక, భక్తి భావాలు పెంపొందించడం, ప్రపంచ శాంతిని కోరుతూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని ఎల్వీ సేవావేదిక వృద్ధుల దేవాలయంలో జరిగే కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వేమా సుబ్రమణ్యం గుప్తా, డాక్టర్ పొలమడ సత్యదీప మాతాజీ ప్రవచిస్తారని, ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా సెషన్ జడ్జి గుంతా రాజగోపాల్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ తదితరులు పాల్గొంటారని ఎల్వీ కుమార్ పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

కాలనీలను ముంపునకు గురి కానివ్వొద్దు



అభ్యుదయనగర్‌లో పర్యటిస్తున్న అధికారులు, కార్పొరేటర్

వనస్థలిపురం: విజయవాడ జాతీయ రహదారి పనుల సందర్భంగా చింతలకుంట సమీపంలో రోడ్డు ఎత్తు పెరగడంతో అభ్యుదయనగర్, జనప్రియ హోమ్స్ కాలనీలు వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, వరద నీరు మళ్లింపునకు సంబంధిత అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ వెంకటేశ్వర్ రావు తదితర అధికారులతో కలిసి అభ్యుదయనగర్ వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు గంగిరెడ్డి, పవన్‌కుమార్, పీవీఎస్.రావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు
టమోటా రూ.27, వంకాయ రూ.28, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.35, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.50, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.28, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.45.
ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సావిత్రి (ఫైల్)

హస్తినాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఒరిస్సా రాష్ట్రం మాముడిన్, దేబభూమి ఆస్కా గంజాం ప్రాంతానికి చెందిన బేర సావిత్రి(40) విజయ శ్రీకాలనీలోని చెరుకూరి అపార్ట్‌మెంట్ దగ్గర భర్త పిల్లలతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం తమ బంధువులతో కలిసి బైక్‌పై మన్సూరాబాద్ నుంచి హయత్‌నగర్ వెళ్తుండగా ఆటోనగర్ దగ్గర వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సావిత్రి కింద పడింది. ఆమె తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు బేర సంజు(43), అలేఖ్య ప్రసాద్ (24) తీవ్రంగా గాయపడ్డారని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలి కుమారుడు జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కర్రతో కొట్టి.. కారుతో ఉడాయించి

- 100కు కాల్ రాగానే క్షణాల్లో స్పందించిన పోలీసులు
- దోపిడీదారుల రిమాండ్
- అభినందించిన కమిషనర్ సుధీర్‌బాబు



హస్తినాపురం: ఆపదలో ఉన్న బాధితుడు 100కు డయల్ చేసిన వెంటనే స్పందించిన పోలీసులు దోపిడీదారులను రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున పెట్రో మొబైల్ 100 కాల్ రాగానే కేవలం ఆరు నిమిషాల్లోనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సాగర్ రహదారిపై విపాసన యూటర్న్ వద్ద ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పల్సర్ పై వచ్చి కారును ఆపి అందులో ఉన్న రాఘవేందర్‌రెడ్డిని కర్రలతో కొట్టి బాధితుడి కారునంబర్ (టీఎస్ 07జీఎన్ 6470)లో పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, అంబులెన్స్ డ్రైవర్ మరికొందరి సహాయంతో వారిని వెంబడించి కమ్మగూడ వద్ద కారుతో పాటు పొన్నాడ క్రాంతి(28), రావుల రాహుల్(21)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. మరో వ్యక్తి రోహిత్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. క్షణాల్లో స్పందించి నేరస్తులను పట్టుకున్నందుకు ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, పెట్రో మొబైల్-2 సిబ్బంది నీలేష్‌కుమార్, డ్రైవర్ సురేందర్, బ్లూకోట్స్ రామక్రిష్ణా, ఐలయ్య, అంబులెన్స్ డ్రైవర్ కృష్ణగౌడ్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులు అందజేశారు.

భారత రాజ్యాంగ రక్షణే ధ్యేయం

మీర్‌పేట: భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌లో సంస్థ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ కొంగరి అశోక్ ప్రారంభించారు. భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పీ.వై.గిరి మహరాజ్ మాట్లాడుతూ.. బీ.ఆర్.అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా సంస్థను స్థాపించామని తెలిపారు. దీంతో పాటు భారత రాజ్యాంగ రక్షణే ప్రధాన లక్ష్యమని వివరించారు. కిరణ్ మహరాజ్, బబ్లూ, రాజు, వీ.కే.రాజు, లక్ష్మణ్, కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మన్సూరాబాద్: ఉద్యోగులందరూ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అభివృద్ధికి కృషి చేయాలని, ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని జీఎస్ఐ సౌతర్న్ రీజియన్ ఏడీజీ హెచ్‌ఓడీ ఎస్పీ పట్‌బాజీ అన్నారు. జీఎస్ఐ కాంప్లెక్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ సంఘ్ 5వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవరావు, రామిరెడ్డి, సుధాకర్‌రావు, చక్రేశ్వర్, రాంమ్మోహన్, మధిర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..



మన్సూరాబాద్: జీఎస్ఐ ఎంప్లాయిస్ సంఘ్ రీజినల్ కమిటీని శుక్రవారం జరిగిన కాన్ఫరెన్స్ సమావేశాల్లో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా స్వామిగౌడ్, వైస్ చైర్మన్లుగా సుబ్రహ్మణ్యం, లింగ్యా, దయానంద్, ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వీసీ మాథ్యూస్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం.సురేష్, సహాయ ప్రధాన కార్యదర్శులుగా సునిల్‌కుమార్, అమరనాథ్, సురేష్‌బాబు, మేఘరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మనోజ్‌కుమార్, ఊశయ్య, సయ్యద్ లియాఖత్ అలీ, రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా లావణ్య, జ్యోత్స్న, మాధవి, నవీన్‌కుమార్, రాజశేఖర్, ప్రకాష్‌రావు, రమణయ్య, సిరాజొద్దీన్, రోషన్ ఖాడ్గీ, అభిమన్యుసింగ్, అశోక్, అభిషేక్‌ను ఎన్నుకున్నట్లు నూతన చైర్మన్ తెలిపారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం దుర్గాదేవి హరిద్రఖాండ మాల (పసుపు కొమ్మల మాల) అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రవి, మురళీ, రమణమూర్తి, రమేష్, అజయ్, అశోక్, సత్తిరెడ్డి, అర్చకులు బాలమురళీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

నియామకం



విజయలక్ష్మికి నియామక పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం కార్యదర్శిగా ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన విజయలక్ష్మిని నియమించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లి శ్రీనివాస్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని ప్రాంతాల వాసులను కలుపుకొని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంఘాన్ని పటిష్టం చేయడానికి చర్యలు చేపడతామన్నారు. కల్పవల్లి, రాఘునందన్, పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దు



లక్ష్మీనారాయణ

మలక్‌పేట: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు అమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మబలిదానం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించారన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడని, ఆ మహనీయుని జ్ఞాపకార్థం తెలుగు విశ్వ విద్యాలయానికి ఆయన పేరు పెట్టుకుని సముచితమైన రీతిలో గౌరవించుకుంటున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులుగా సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలని భావించడం సమంజసం కాదన్నారు. ఏదైనా ప్రాజెక్టుకు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టి సముచిత రీతిలో గౌరవించాలని, అదే విధంగా అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలకు తెలిసేలా తెలుగు విశ్వ విద్యాలయానికి ఆయన పేరును కొనసాగించాలన్నారు.

వనస్థలిపురంలో బేసిక్స్ స్టోర్ ఏర్పాటు



లక్డీకాపూల్: హైదరాబాద్ ట్రెండింగ్‌కి ల్యాండ్‌మార్క్‌గా ఆదరణ పొందుతున్న బేసిక్స్ 5వ స్టోర్ అందుబాటులోకి వచ్చింది. వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్టు నిర్వాహకులు పేర్కొంటున్నారు. 850 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన స్టోర్ వినియోగదారులను ఆకట్టుకుంటుందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్లతో పాటు సరికొత్త డిజైన్లతో కూడిన ఈ స్టోర్ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు.